ఆందోళన వద్దు... అవగాహన ముద్దు

- కుష్టు వ్యాధి నివారణకు ఆధునిక చికిత్స
- ఈ నెల 13 వరకూ అవగాహన

పెద్దాపురం: కుష్టు... దీనిని సామాజిక సమస్యగా పరిగణించాలి. ఈ వ్యాధి లక్షణాలున్న వారు సకాలంలో వైద్యులను సంప్రదిస్తే ఆధునిక చికిత్స పద్ధతుల ద్వారా నయం చేసుకోవచ్చు. 2027 నాటికి ఈ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయి. జనవరి 20 నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) నిర్వహించారు. స్పర్శ పేరుతో జనవరి 30న వ్యాధిగ్రస్తుల పట్ల సమాజం చూడాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఈ నెల 13 వరకూ చైతన్య కార్యక్రమాలు సాగనున్నాయి.

వైఎస్ జగన్ హయాంలో..

గత ఏడాది జూన్ 16 నుంచి జూలై 16వ తేదీ వరకూ కేంద్ర ప్రభుత్వంతో కలసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టింది. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,408 సర్వే బృందాలను నియమించింది. క్షేత్ర స్థాయిలో సర్వే చేసి శరీరంపై మచ్చలు కలిగిన వారికి మెరుగైన పరీక్షలకు నివేదించేవారు. ఇలా పెద్దాపురం మండలం కాండ్రకోట పీహెచ్‌సీ పరిధిలో 18, పులిమేరు పీహెచ్‌సీ పరిధిలో 16 బృందాల చొప్పున సర్వే చేశాయి.


కాండ్రకోటలో కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నియోజకవర్గంలో తీవ్రత ఇలా...

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఐదు కన్నా తక్కువ మచ్చలున్న వారిని పాసి బ్యాచిలర్ కేసుగా, ఐదు కన్నా ఎక్కువ మచ్చలుండే వారిని మల్టీ బ్యాచిలర్ కేసులుగా పరిగణిస్తారు. పీబీ కేసులకు రెండు రకాల మందులను ఆరు నెలలు, ఎంబీ కేసులకు మూడు రకాల మందులు ఏడాది పాటు వాడాల్సి ఉంటుంది. పెద్దాపురం మండలం కాండ్రకోట పీహెచ్‌సీ పరిధిలో రెండు, పులిమేరు పీహెచ్‌సీ పరిధిలో మూడు కేసులను గుర్తించారు.

క్షేత్రస్థాయిలో గుర్తింపు

కుష్టు నిర్మూలనకు క్షేత్రస్థాయిలో ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు కృషి చేస్తారు. ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే వీరిని సంప్రదించాలి. వారి ద్వారా నిర్మాణపరమైన చికిత్స ఇతర సేవలందుతాయి.

ప్రతి సీహెచ్‌సీలో ఎంపీహెచ్ఎస్ స్థాయిలో ఉద్యోగిని నోడల్ పర్సన్‌గా నియమించారు. వారిని డీపీఎంఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో అడిషనల్ డీఎంహెచ్ఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లక్షణాలున్న వారికి వ్యాధి సోకినది, లేనిది ఈ టీమ్ నిర్ధారిస్తుంది.

మానసిక దృఢత్వంతో మేలు

కుష్టు వ్యాధికి ఆధునిక చికిత్సలున్నాయి. తొలుత వ్యాధిగ్రస్తులు మానసికంగా దృఢంగా ఉండాలి. మైక్రో బ్యాక్టీరియా ప్రభావంతో ఈ వ్యాధి సోకుతుంది. శరీరంపై రాజరంగు మచ్చలొస్తాయి. ఆ మచ్చపై వెంట్రుకలు రాలిపోతాయి. దురద, స్పర్శ, నొప్పి ఉండవు. ఈ ప్రారంభ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆశ, ఏఎన్ఎంలకు చెప్పాలి. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్స అందిస్తారు. పుండ్లు ఉన్నవారికి అవసరమైతే కత్తిపూడిలోని రిఫరల్ లెప్రసీ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేస్తారు.

లక్షణాలు కనిపిస్తే సంప్రదించండి



ప్రతి పీహెచ్‌సీలో కుష్టు వ్యాధికి సంబంధించిన కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు నోడల్ పర్సన్ ఉంటారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీపీఎంఓ స్థాయి అధికారి పర్యవేక్షణలో కళాశాలలు, పాఠశాలలో జనావాసాలకు వెళ్లి వ్యాధి లక్షణాలను వివరిస్తున్నాం. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రిని కాని, వైద్య ఆరోగ్య కార్యకర్తను గాని సంప్రదించాలి.

–వీఎస్ గోవిందరాజులు,
నోడల్ ఆఫీసర్, కాండ్రకోట పీహెచ్‌సీ

క్లుప్తంగా

కన్నులపండువగా వేంకటేశ్వరుని కల్యాణం

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణోత్సవం శనివారం కన్నులపండువగా జరిగింది. శుక్రవారం నుంచి ప్రారంభమైన కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి వారి దివ్య రథోత్సవం భక్తజన హరినామ స్మరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి మేళతాళాల నడుమ గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో మూలమూర్తికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 9 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం వేద మంత్రోచ్ఛారణల మధ్య కన్నులపండువగా నిర్వహించగా భక్తులు స్వామి వార్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సామర్లకోట: వేట్లపాలెంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరుని ఆలయంలో స్వామివారి కల్యాణం శనివారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై రాత్రి 8.30 నిమిషాలకు స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణం జరిపించారు. పారిశ్రామిక వేత్తలు మల్లాడి యశ్వంత్ చౌదరి, శారిక దంపతులు, మండవిల్లి శ్రీనివాసు, లక్ష్మీ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో కల్యాణాన్ని వాడపల్లి గోపాలాచార్యులు చేయించారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహణ చట్టరీత్యా నేరం అనే విషయంపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది శనివారం గొల్లప్రోలు మండలం కొడవలిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ జి.శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ అహ్మద్‌బాషా తదితరులు పాల్గొని ఆడ శిశువును గర్భంలోనే తుంచేయడం నేరమని, ఆడది ఒక తల్లిగా, చెల్లిగా, అక్కగా సృష్టికి మూలమని అలాంటి ఆడ శిశువును వద్దనుకోవడం గర్భంలోనే తుంచేయడం నేరమని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆడ శిశువును కాపాడుకుందాం సృష్టిని రక్షిద్దాం అంటూ ప్రజలకు వివరించారు. ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

పిఠాపురం: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడంపై పిఠాపురం నియోజవర్గ బీజేపీ కార్యకర్తలు, నాయకులు పిఠాపురంలో స్వీట్లు పంచుకుంటూ తమ హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పిఠాపురం పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వాసంశెట్టి శ్రీనివాస్, బిళ్ళకుర్తి రామేశ్వర్ రెడ్డి, బుర్రి మురళీధర్ రావు, పసుపులేటి సత్యనారాయణ, యు.కొత్తపల్లి అధ్యక్షుడు శేషు పాల్గొన్నారు.

సామర్లకోట: ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించడంతో స్థానిక నాయకులు విజయోత్సవం జరుపుకొన్నారు. శనివారం స్థానిక స్టేషన్ సెంటర్‌లో నియోజకవర్గ బీజేపీ నాయకుడు గొరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు పుప్పాల నాగగోవిందు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకవిల్లి బాపిరాజు, కర్రి ఆదినారాయణరెడ్డి, అర్జునుడు, జీవీకే మోహనరావు, కాపుగంటి పైడిరత్నం, సోమేష్ పాల్గొన్నారు.

లాకరు నుంచి గర్భగుడికి..

విశేష ఆభరణాల అలంకరణలో కుంతీమాధవ స్వామి

పిఠాపురం: విశేష ఆభరణాల అలంకారంలో కుంతీమాధవ స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఏడాదికి ఓసారి మాత్రమే అలంకరించే విశేష ఆభరణాలను శుక్రవారం అధికారులు లాకరు నుంచి ఆలయానికి తీసుకువచ్చారు. కల్యాణ వేళ అత్యంత విలువైన వజ్రవైఢూర్యాలు, మణిమాణిక్యాలతో కూడిన ఆభరణాల అలంకారంలో కుంతీమాధవ స్వామి శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. విలువ కట్టలేని అత్యంత ప్రాచీన కుంతీమాధవస్వామి, రాజ్యలక్ష్మీదేవి అమ్మవారి ఆభరణాలను ఆలయంలో భద్రత లేక స్థానిక బ్యాంకు లాకర్‌లో భద్రపరుస్తారు. ఏడాదికి ఓసారి స్వామివారి కల్యాణోత్సవాల సమయంలో మాత్రమే అత్యంత భద్రత (సాయుధ పోలీసుల) నడుమ అధికారులు తీసుకువచ్చి కల్యాణోత్సవాల అనంతరం తిరిగి బ్యాంకులో భద్రపరుస్తారు. ఆలయంలో ఆభరణాలు ఉన్నన్ని రోజులు సాయుధ పోలీసుల పహారాలో నిరంతర పర్యవేక్షణలో ఉంటాయి. కల్యాణోత్సవాల సందర్భంగా స్వామి వారికి ఈ ఆభరణాలను అలంకరిస్తారు. దీని కోసం శుక్రవారం పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సాయుధ బలగాల పహారా నడుమ సిబ్బందితో కలిసి ఆలయ ఈఓ ఎస్.శ్రీరాములు దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీ అధికారి వి.ఫణీంద్రకుమార్ సమక్షంలో స్వామి వారి దివ్యాభరణాలను బ్యాంకు లాకర్ నుంచి తీసుకువచ్చారు. ఆభరణాలను లెక్క చూసి ఆలయ అర్చకులకు వాటిని అప్పగించారు. ఈనెల 13వ తేదీ వరకు స్వామికి అలంకారంలో ఈ ఆభరణాలు ఉండనుండడంతో వాటికి రక్షణగా సాయుధ పోలీసుల పహారా ఏర్పాటు చేశారు.


విశేష ఆభరణాల అలంకరణలో కుంతీ మాధవస్వామి- రాజ్యలక్ష్మీ అమ్మవారు

గుర్రపుడెక్క తొలగింపునకు శ్రీకారం


బైపాస్ కాలువలో గుర్రపు డెక్క తొలగిస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక ఫిల్టర్ బెడ్‌కు బైపాస్ కాలువ నుంచి నీరు విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న నాగార్జున చెరువు నుంచి ఫిల్టర్ బెడ్ ప్లాంట్‌కు నీరు అందుతుంది. అయితే నాగార్జున ఫ్యాక్టరీ యాజమాన్యం ఇరిగేషన్ శాఖకు రూ.90 లక్షల బకాయి చెల్లించక పోవడంతో గోదావరి జలాలు నాగార్జున ఫిల్టర్ చెరువులోకి రాకుండా ఇరిగేషన్ అధికారులు గేట్లు మూసివేశారు. ఇలా కొంత కాలంగా బైపాస్ కాలువ ద్వారా ఫిల్టర్ బెడ్ ప్లాంట్‌కు నీరు సరఫరా చేసుకుంటున్న ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ మేరకు మున్సిపల్ ప్రజలకు తాగునీటిని బైపాస్ కాలువ ద్వారా విడుదల చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, డీఈ శశిధర్‌లు ఇరిగేషన్ అధికారులు, పబ్లిక్ హెల్త్ అధికారులకు దరఖాస్తులు చేశారు. బైపాస్ కాలువ ద్వారా నీరు విడుదల చేస్తే ఆ నీరు చెరువులోకి వెళుతుందని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. దాంతో బైపాస్ కాలువను పరిశీలించి మున్సిపాలిటీకి నీరు ఇస్తామని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేశారు. శనివారం పబ్లిక్ హెల్త్ అధికారులు బైపాస్ కాలువను పరిశీలించి కాలువలో గుర్రపుడెక్క ఉన్న విషయాన్ని గమనించి దానిని తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను పబ్లిక్ హెల్త్ డీఈ గంగరాజు, ఇన్‌స్పెక్టర్ శంకర్, సూపర్‌వైజర్ సత్యనారాయణ పరిశీలించారు. బైపాస్ కాలువ నుంచి నీరు చెరువులోకి వెళ్లకుండా ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. దాంతో మున్సిపల్ ఫిల్టర్ బెడ్‌ను నేరుగా బైపాస్ కాలువ నుంచి నీరు వచ్చే అవకాశం ఉంది. ఆదివారం నుంచి గోదావరి జలాలు అందుతాయని ప్రజలు ఆశ పడుతున్నారు. మరి ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తారో చూడాలి.

జిల్లా స్థాయి సీనియర్ వుమెన్ బాక్సింగ్ ఎంపికలు

పిఠాపురం: ఈనెల 9వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో కాకినాడ జిల్లా స్థాయి వుమెన్ బాక్సింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మణరావు తెలిపారు. ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో కాకినాడ జిల్లా నుంచి పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనేవారు 1-1-1984 నుంచి 31-12-2005 మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. బాక్సర్స్ ఆధార్‌కార్డు జిరాక్స్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 99890 01162ను సంప్రదించాలన్నారు.

ఘనంగా బషీర్‌బీబీ ఉత్సవాలు


ప్రార్థనలు నిర్వహిస్తున్న ముజావర్లు

కొత్తపల్లి: మండలం పొన్నాడలో వేంచేసిన బషీర్‌బీబీ (బంగారు పాపమ్మ) ఉరుసులో భాగంగా రెండో రోజైన శనివారం భక్తజనం పోటెత్తారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణం వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ దుకాణాలు ఏర్పాటు చేయడంతో దేవాలయ ప్రాంగణం చుట్టుపక్కల ప్రాంతాలు భక్తులతో కళకళలాడాయి. ఇప్పటికే ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు స్థానికంగా బస ఏర్పాటు చేసుకొని ఉండిపోతుండడంతో రోజురోజుకీ ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో నిండిపోతున్నాయి. వివిధ వాహనాలపై తరలి వచ్చిన భక్తులు శనివారం ఉదయం నుంచి బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక వైద్యఆరోగ్యశాఖాధికారులు ప్రత్యేక వైద్యశాలను ఏర్పాటు చేశారు. స్థానిక షేక్ బడే సాహెబ్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం నిర్వహించనున్న గంధోత్సవం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ముజావర్లు తెలిపారు. కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని వాహనాలను ఆలయ ప్రాంగణంలోకి వెళ్లనివ్వకుండా పొన్నాడ, నాగులపల్లి వద్దే నిలిపివేస్తున్నారు. అదే విధంగా గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో భక్తులకు కావాల్సిన తాగునీరు, పారిశుధ్యం, పలు సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఉన్నత స్థాయిలో నిలవడం అభినందనీయం


కృష్ణబాబును సత్కరిస్తున్న యాజమాన్యం, పూర్వ విద్యార్థులు

పెద్దాపురం: స్థానిక ఎస్‌కేకేఎం విద్యా సంస్థల విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలవడం అభినందనీయమని తెలుగు అధ్యాపకుడు, సాహితీ స్రవంతి అధ్యక్షుడు జ్యోస్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక ఎస్‌కేకేఎం విద్యా సంస్థలు ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులచే శనివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ కుంచే చినబాబు అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణబాబు మాట్లాడారు. ఎస్‌కేకేఎం విద్యా సంస్థ ద్వారా పెద్దాపురం పట్టణానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు. సీనియర్ సివిల్ జడ్జి జి.స్రవంతి, సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నిస్వామితో పాటు సీనియర్ ఆడిటర్లు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులను సత్కరించారు. పూర్వ విద్యార్థులతో పాటు ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మేడిది చక్రం, ఏసుబాబు, బాబూరావు, మధుసూదనరావు, ప్రిన్సిపాల్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగులో మెళకువలపై శిక్షణ


సేంద్రియ సాగుపై శిక్షణ ఇస్తున్న అధికారులు

పిఠాపురం: 26 జిల్లాలకు చెందిన ఎస్‌పీఎం షాప్ యజమానులకు రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం శనివారం పిఠాపురం మండలం పి.రాయవరంలో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో తీసుకువచ్చిన కొత్త వ్యవసాయ పద్ధతులపై వారికి అధికారులు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా రెండో రోజు పి.రాయవరానికి చెందిన రైతు ఒ.వెంకటేష్ వ్యవసాయ క్షేత్రంలో ఐఎఫ్ఎస్‌సీ మోడల్ పరిశీలించారు. జిల్లా ఎస్ఎఫ్ఏ అప్పలనాయుడు మాట్లాడుతూ వెంకటేష్ వ్యవసాయ క్షేత్రంలో మొత్తం పొలం 1.20 ఎకరాలు కాగా చుట్టుగట్టు 55సెంట్లు, కాలువ చేపల పెంపకం 20 సెంట్లు, మధ్యలో వరి 45 సెంట్లు పంటలు వేశారన్నారు. ఒకే రకం, ఒకే పంట, వరి వేయడం వలన ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల ఆదాయం వస్తుందన్నారు. దానికి బదులుగా ఆయన తన పొలంలో ఐఎఫ్ఎస్ మోడల్‌లో గట్టు మీద పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, చేపల పెంపకం వరి మొత్తం మూడింటి వలన సుమారు ఏడాదికి రూ.లక్ష ఆదాయం వస్తుందన్నారు. ఈ విధంగా పలు రకాల పంటలు వేసుకోవడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం వల్ల భూమి సారవంతంగా మారి దిగుబడులు పెరిగి మరింత ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ కన్సల్టెన్సీ జానకి, బుజ్జిబాబు, రిసోర్స్‌పర్సన్ గోపాలకృష్ణ, గుండ్ర శివచక్రం, రాజ్ కుమార్ యూనిట్ ఇన్‌చార్జ్‌లు రాయవరం క్యాడర్స్ తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి ఆచార్యులుకు ఘన నివాళి

సామర్లకోట: ఆధ్యాత్మిక గురువుగా పేరొందిన ఎక్కిరాల రామస్వామి ఆచార్యుల వర్ధంతిని శనివారం నిర్వహించారు. పేద కుటుంబంలో పుట్టిన రామస్వామి ఆచార్యులు చిన్నతనం నుంచి దైవభక్తి కలిగి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మాండవ్య నారాయణస్వామి ఆలయం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. భీష్మ ఏకాదశిన ఆయన మృతి చెందడంతో ఆయన శిష్య బృందం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన స్వగృహంలోని ప్రార్థనా మందిరం నుంచి మఠం సెంటర్, యార్లగడ్డవారి వీధి, రథం సెంటర్, స్టేషన్ సెంటర్, గొల్లగూడెం వరకూ ఆధ్యాతిక కీర్తనలతో పాదయాత్ర నిర్వహించారు. శిష్య బృందం ఈదల బాబూరావు, జీవీకే మోహనరావు, కాపుగంటి పైడిరత్నం, అర్జునుడు, కర్రి ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.


ఎక్కిరాల రామస్వామి ఆచార్యుల శిష్యుల పాదయాత్ర

స్వామిని చూసి.. మది మురిసి

- వైభవంగా భీష్మ ఏకాదశి పూజలు
- ఆలయాల్లో భక్తుల రద్దీ

సామర్లకోట: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ఆలయాలు కిటకిటలాడాయి. వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం, భీష్మ ఏకాదశి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టార్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తెల్లవారు జామున గోపూజ, 108 మంది మహిళలచే 9 రకాల లక్ష పుష్పాలతో పూజలు, కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయంలో భారీ అన్నదాన జరిగింది. సాయంత్రం చిన్న శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారి కల్యాణం, 10న సదస్యం, 12వ ఉదయం చక్రస్నానం, పూర్ణాహుతి, రాత్రి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆదివారం నుంచి ఆలయం వద్ద జిల్లా స్థాయి భజన పోటీలు ప్రారంభమవుతాయి. సామర్లకోటలో అతి పురాతన మాండవ్య నారాయణస్వామి ఆలయంలో తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకాలు, లక్ష తులసీ దళాల పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పాత సామర్లకోటలోని వేణుగోపాల స్వామి ఆలయం, చంద్రశేఖరస్వామి ఆలయం, జగదీశ్వరస్వామి ఆలయం, విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. పీబీ దేవం గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిగింది.


వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా ఏకాహం

పెద్దాపురం: కాండ్రకోట ప్రసన్నాంజనేయ స్వామి సన్నిధిలో ఏకాహ మహోత్సవాన్ని నిర్వహించారు.. ఆర్‌బీ పట్నం శెట్టిబలిజ రామాలయం వద్ద, గుడివాడ పచ్చాలమ్మ అమ్మవారి ఆలయంలో ఏకాహం నిర్వహించగా కృష్ణాశ్రమం గురువు గవరసాని గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవంలో సర్పంచ్‌గా ఎన్నికైన కనపర్తి చీమదొర పల్లకిని ఎత్తుకుని ఉత్సవమూర్తుల ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహించారు. తాటిపర్తిలో ప్రసన్నాంజనేయ స్వామి యాత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భీష్మ ఏకాదశి వేడుకల్లో వైఎస్సార్ సీపీ మండల పార్టీ యాత్ అధ్యక్షుడు గోపు మురళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో గీతా పారాయణను స్థానిక కుమ్మర వీధిలో ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, గీతా పారాయణ ప్రవచనం, సంకీర్తన, శాంతి మంత్రాలు నిర్వహించిన మల్లికార్జున స్వామి ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీష్మ ఏకాదశి పర్వదినాన గీతా పారాయణ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆర్గనైజర్ సత్యకుమార్, నేతి వీరభద్రరావులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేశారు. కార్యక్రమంలో గోలి వెంకట రామచంద్రచౌదరి, కన్వీనర్ శ్రీకృష్ణదేవ మనోహర్, వేదగీతామత, ముమ్మిడి జంగమయ్య, గిరిజన మహిళా భక్త సమాజాలు, భక్తులు పాల్గొన్నారు.


వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామి


రాయభూపాలపట్నంలో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు

పిఠాపురం: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పిఠాపురం పాదగయ, కుంతీమాధవస్వామి తదితర ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తపల్లి: మండలంలో ఉన్న వైష్ణవాలయాలు భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. కొమరగిరిలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద ఏకాహం నిర్వహించారు. గోర్స పురాతన రామాలయం, రమణక్కపేటలో విజయజనార్ధన స్వామి, ఉప్పాడ, కొండెవరం, కోనపాపపేటల్లో ఉన్న వేంకటేశ్వర స్వామి, ఉప్పాడలోని లక్ష్మీ నరసింహస్వామి, కొత్తపల్లిలోని రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


కొమరగిరి ప్రసన్నాంజనేయ స్వామి ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఏకాహం


పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


గీతా పారాయణ చేస్తున్న మల్లికార్జునస్వామి

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


సామర్లకోటలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామివారికి నీటితో అభిషేకాలు చేశారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, భాస్కర్‌లు పూజాధికాలు చేశారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఇటలీకి చెందిన ఓ భక్తుడు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఓం నమః శివాయ అంటూ ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేశాడు.


సామర్లకోట పంచారామ క్షేత్రంలో ఇటలీకి చెందిన భక్తుడు